# గణనాధునికి వెండి పూజా సామాగ్రి విరాళం



కాణిపాకం, జూన్ 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు శనివారం 3.80 లక్షలు రూపాయలు విలువగల వెండి పూజా సామాగ్రిని విరాళంగా అందజేశారు. ఈమేరకు తిరుపతికి చెందిన చంద్రశేఖర్ అనే భక్తుడు సుమారు 3 కిలోల 500 గ్రామాల వెండితో 3.80 లక్షల రూపాయల వ్యయంతో ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి దీపం, నైవేద్యం పాత్రలు ఆలయానికి విరాళంగా అందజేశారు. వాటిని ఆలయ ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు,


# తిరుపతి - చిత్తూరు





# తిరుచ్చిపై 'దేవేరులతో శ్రీనివాసుడు'



చంద్రగిరి, జూన్ 14 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం స్వామివారు (జన్మనక్షత్రం) శ్రవణ నక్షత్రంను పురస్కరించుకుని శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం హామీల అమలుకు కట్టుబడి ఉంది

## - పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ



రామచంద్రాపురం, తిరుపతి కార్పొరేషన్, జూన్ 14, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్‌లోని పలు హామీలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తోందని, పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని, మున్సిపల్ శాఖ ద్వారా ప్రజలకు అందాల్సిన సేవలను కనీస సౌకర్యాల కల్పనకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం రామాపురం డంపింగ్ యార్డ్‌ను మున్సిపల్ శాఖ మంత్రి గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మున్సిపల్ అధికారులు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్రంలో గత ప్రభుత్వం వదిలి వెళ్ళిన 85 లక్షల టన్నుల లెగసిసీ, గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకలతో 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులను ఈ ప్రభుత్వానికి వదిలేసి వెళ్లారు అని అన్నారు. మన ముఖ్యమంత్రి విజన్ ఉన్న నాయకుడు అని, గతంలోనే చంద్రబాబు నాయుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నప్పుడు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని అమలు చేశారన్నారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్టోబర్ రెండవ తేదీ మచిలీపట్నంలో ప్రకటించారనీ 365 రోజుల్లో ఈ రాష్ట్రంలో ఉన్న 85 లక్షలు టన్నుల చెత్తను క్లియర్ చేస్తామని తెలిపారని అన్నారు. అందులో భాగంగా పలు సార్లు సమావేశాలు, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చేపట్టామని, అలాగే చెత్తను క్లియర్ చేయడానికి పలు కంపెనీలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 45 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడం జరిగిందని ఇంకనూ రాబోయే మూడు నెలలలో 35 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మన తిరుపతి జిల్లా తీసుకుంటే జిగ్మా అనే కంపెనీ ముందుకు వచ్చిందని వాళ్ల రోజుకు 900 టన్నుల లెగసి క్లియర్ చేస్తున్నారు. అయితే రోజుకు వారు 2700 టన్నులు క్లియర్ చేయాల్సి ఉందనీ, ఏవైతే మున్సిపాలిటీలలో రోజువారీగా క్లియర్ చేయవలసిన లెగసీకన్నా తక్కువ చేస్తున్నారో సమీక్షించినప్పుడు వాటిని ప్రత్యక్షంగా పరిశీలించాలని జిల్లాల పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా కు రావడం జరిగింది తెలిపారు. పవర్ కనెక్షన్ లేదని కంపెనీ వారి తెలుపుతున్నారని, జనరేటర్ మీద చేపడుతున్నారని సమస్యను క్లియర్ చేయాలని తెలుపగా జెసి గారిని ఫాలో అప్ చేయాలని ఆదేశించామని, నాలుగైదు రోజుల్లో పవర్ కనెక్షన్ ఇస్తామని ఎస్ఈ ఎపిఎస్‌పిడిసిఎల్ తెలిపారని అన్నారు. ఈ లెగసి క్లియరెన్స్ కార్యక్రమంలో కృషి చేస్తున్న అధికారులందరినీ, కంపెనీ ప్రతినిధులను ప్రత్యేకంగా అందరిని అభినందిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ శాఖ ద్వారా ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాల ఏర్పాటుకు అన్ని చర్యలు చేపడతామని తెలిపారు. రామాపురం డంపింగ్ యార్డ్ నందు వేస్ట్ టు ఎనర్జీ తయారీ చెత్త నుండి సంపద సృష్టి జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ గోమతి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా అడుగులు

## తోతాపురి రైతుకు కేజీ రూ.12 మద్దతు ధర చెల్లింపు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



మంగసముద్రం మార్కెట్ యార్డులో మామిడి రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

చిత్తూరు, జూన్ 14 ప్రభాతవార్త: సిఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, దాని అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ మామిడి సీజన్‌లో తోతాపురి రైతును ఆదుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం తోతాపురి కేజీ ధర రూ.12 నిర్ణయించిందన్నారు. మంగసముద్రం మార్కెట్ యార్డులో శనివారం మంత్రి అచ్చెన్నాయుడు మామిడి తోతాపురి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం ఈ సీజన్‌లో తోతాపురి మామిడి మద్దతు ధర నిర్ణయించడంపై రైతులు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీలు అమలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంత మంది పిల్లలు వుంటే అంత మంది పిల్లల తల్లుల బ్యాంకు ఖాతాలోకి తల్లికి వందనం పథకం కింద ఒకొక్క పిల్లవాడికి రూ.13 వేలు జమ చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినప్పటికీ ఆ విషయంను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీలు అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోటి మంది మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. విజన్ కలిగిన సిఎం నారా చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రంను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్నికల్లో హామీ అమలులో భాగంగా ఇప్పటికే అన్న క్యాంటీన్లను ప్రారంభించి తక్కువ ధరకు నిరుపేదలకు భోజనం అందిస్తున్నామని, అలాగే అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3 వేలుగా వున్న పెన్షన్‌ను రూ.4 వేలుగా పెంచి లబ్దిదారులకు అందిస్తున్నామన్నారు. అలాగే డిఎస్సీ నిర్వహించి నిరుద్యోగ ఉపాధ్యాయుల కలను సకారం చేశామన్నారు. అలాగే వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా బడ్జెట్‌లో రూ.130 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులతో శనివారం చర్చలు నిర్వహించి ఒక ధర నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మేరకు ప్రాసెసింగ్ యూనిట్లు రైతుకు తోతాపురి కేజీపై రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం కేజీపై రూ.4 రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. దీని కోసం సంబంధిత శాఖలు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు తమ తోటల్లో చివరి మామిడి కాయ వరకు నిర్ణయించిన ధరకు విక్రయించుకోవచ్చునన్నారు. రైతులు సైతం నాణ్యమైన మామిడి కాయలను ప్రాసెసింగ్ యూనిట్లకు సరఫరా చేయాలన్నారు. అలాగే మంగ సముద్రం మార్కెట్ యార్డును మోడల్ యార్డుగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ తోతాపురి రైతుల ప్రయోజనార్ధం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో పలుమార్లు ప్రాసెసింగ్ కంపెనీల యాజమానులతో చర్చలు నిర్వహించి మామిడి మద్దతు ధరను నిర్ణయించి ఈ విషయంను సిఎం దృష్టికి తీసుకెళ్ళి అక్కడి నుండి వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్ళి ధరను ఖరారు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మామిడి రైతులు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, హార్టికల్చర్ సెక్రటరీ రాజశేఖర్‌బాబు, అగ్రికల్చర్ కమీషనర్ శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, జిల్లా దేశం ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, జిల్లా అధికారులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

# రథంపై ప్రసన్న వేంకటేశ్వరుడు అభయం





వడమాలపేట, జూన్ 14 ప్రభాతవార్త: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి రథోత్సవంపై వైభవంగా ఊరేగారు. శనివారం ఉదయం సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను నిర్వహించారు. పుణ్యావచనం, నవగ్రహపూజ చేపట్టారు. అనంతరం వాహన మండపం చేరుకున్న స్వామివారు రథారోహణం, రథాగమనం నిర్వహించారు. భక్తజన సమోహం మధ్య రథోత్సవం ముందుకు సాగింది. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకుఊంజల్‌సేవ ఘనంగా నిర్వహించారు. తిరిగి వాహన మండపం చేరుకున్న శ్రీవారు రాత్రి 7 గంటలకు అశ్వ వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లోని భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, కంకణ బట్టర్ తిప్పయాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, రమణాచార్యులు, వేద పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు చక్రస్నానం**

శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆదివారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరగనుంది. ఇందులో భాగంగా ఉదయం 9.15 నుంచి 10.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి, చక్రత్తాళ్వార్ వారికి వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉదయం 10.30 నుంచి 10.45 గంటల వరకు ఆలయం ఎదురుగా గల పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం జరుగుతుందని, ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు.

# గణనాధునికి వైభవంగా స్వర్ణ రథోత్సవం



కాణిపాకం, జూన్ 14 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయ హస్తం అందించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వర్ణరథంపై వుంచి ఆలయ మాడావీధుల్లో ఊరేగించారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

# తోతాపురి.. రైతుల తిప్పలు

## - కేజీ ధర రూ.12 దక్కని వైనం



చిత్తూరు, జూన్ 14 ప్రభాతవార్త: తోతాపురి మామిడి రైతులు పల్ప్ ఫ్యాక్టరీల వద్ద కాయలు తీసుకు వచ్చి తిప్పలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తోతాపురి మామిడి కేజీకి రూ.12 గిట్టుబాటు ధర ప్రకటించి పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులు రైతుకు కేజీ తోతాపురిపై రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం అదనంగా కేజీకి రూ.4 చెల్లిస్తోందని ప్రకటించింది. అయితే పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులు రైతుల నుండి తోతాపురి కేజీ రూ.8 చెల్లించి కొనుగోలు చేయడానికి ససేమిరా కుదరదని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని పల్ప్ ఫ్యాక్టరీలో తోతాపురి కేజీపై రైతుకు రూ.5 నుండి రూ.6 చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు. గత ఏడాది తోతాపురి మామిడి కేజీ రూ.25 నుండి రూ.30 వరకు పలకడంతో ఇదే ధర ఈ సీజన్‌లో సైతం లభిస్తుందని జిల్లాలోని తోతాపురి రైతులు భావించారు. అయితే జిల్లాలో ఈ సీజన్‌లో తోతాపురి మామిడి దిగుబడి ఎక్కువగా వుండటం, గత సీజన్‌లో పల్ప్ ఫ్యాక్టరీలు తయారు చేసిన పల్ప్ నిల్వలు అలాగే వుండిపోవడంతో ఈ సీజన్‌లో అత్యధిక పల్ప్ ఫ్యాక్టరీలు పల్ప్ తయారు చేయడానికి సిద్ధం కాలేదు. అదే సమయంలో చిత్తూరు జిల్లాకు సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడు లోని ధర్మపురి, కృష్ణగిరి ప్రాంతాల్లో తోతాపురి మామిడి దిగుబడి అత్యధికంగా వుండటం, అక్కడి ఫ్యాక్టరీలు రైతులకు కేజీపై రూ.4 నుండి రూ.5 చెల్లిస్తుండటంతో అక్కడి రైతులకు చిత్తూరు జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలు మార్కెట్ అయ్యాయి. ఒక కేజీ తోతాపురి రూ.6 వచ్చినా ఫర్వాలేదని భావించి తమిళనాడు రాష్ట్ర రైతులు జిల్లాలోని మామిడి పల్ప్ ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని తోతాపురి మామిడి రైతులను ఎలాగైనా ఆదుకుని వారికి గిట్టుబాటు ధర కల్పించాలని నిర్ణయించి రెండు నెలలుగా ఇటు తోతాపురి మామిడి రైతులు, అటు పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులతో చర్చలు నిర్వహించి కసరత్తు చేశారు. ఈ కసరత్తులో భాగంగా ప్రభుత్వం తోతాపురి మామిడి గిట్టుబాటు ధర కేజీ రూ.12గా ఖరారు చేసింది. ఇందులో ప్రభుత్వం తోతాపురి రైతుకు నేరుగా కేజీపై రూ.4 చెల్లిస్తే మిగిలిన రూ.8 రైతులకు పల్ప్ ఫ్యాక్టరీలు చెల్లించాల్సి వుంటుంది. జిల్లా వ్యాప్తంగా 34 పల్ప్ ఫ్యాక్టరీలు ప్రస్తుతం తోతాపురి మామిడి రైతులకు అందుబాటులో వున్నాయని అధికారులు ప్రకటించినప్పటికీ వీటిలో నాలుగైదు ఫ్యాక్టరీలు తోతాపురి మామిడి కొనుగోలు చేయడం లేదు. అలాగే తోతాపురి మామిడి రైతులు ర్యాంప్స్, మార్కెట్ కమిటీల్లో సైతం తోతాపురి మామిడిని విక్రయిస్తున్నారు. ఈ పల్ప్ ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మార్కెట్ యార్డుల వద్దకు జిల్లా అధికార యంత్రాంగం ఇటు రెవెన్యూ, ఉద్యాన శాఖ సిబ్బందిని నియమించి మామిడి పంటను పల్ప్ ఫ్యాక్టరీలకు తరలించిన రైతుల వివరాలను సేకరించి జాబితాను సిద్ధం చేస్తోంది. జిల్లాలో తోతాపురి మామిడి కేజీ రూ.12గా ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ ఆ మేరకు గిట్టుబాటు ధర రైతులకు లభించడం లేదని విమర్శలు వస్తున్నాయి. జిల్లా అధికార యంత్రాంగం దీనిపై మరోసారి దృష్టి సారించి తోతాపురి మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# యోగా దినచర్యలో భాగం కావాలి

## - జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి కార్పొరేషన్, జూన్ 14, ప్రభాతవార్త: యోగా అనేది ప్రతి ఒక్కరి దినచర్యలో భాగం కావాలి అని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇందిరా మైదానం ఇండోర్ మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, కార్పొరేటర్ నరసింహాచారి, పాల్గొని యోగా చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ అంత ర్జాతీయ యోగా దినోత్సవం భాగంగానే మూడు వారాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా వ్యా ప్తంగా పెద్దఎత్తున యోగ కార్యక్రమాలు నిర్వ హించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే మన జిల్లాలో సుమారుగా తొమ్మిది లక్షలు సిటిజన్స్ కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది అని అన్నారు. జీవితంలో ఒక దినచర్యలో భాగంగా అవ్వాలని ఉద్దేశంతో 21 తారీకు తర్వాత కూడా ప్రతి ఒక్క పౌరుడు కూడా యోగాన్ని వాళ్ల దినచర్యలో భాగంగా ప్రతి రోజు చేయాలనేది ఉద్దేశంతోనే గౌరవ ముఖ్యమంత్రి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టూరిజం ఆర్‌డి రమణ ప్రసాద్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి. బాలక్రిష్ణ నాయక్



ఓజిలి, జూన్ 14, ప్రభాతవార్త మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ,సిబ్బంది ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి. బాలక్రిష్ణ నాయక్ సూచించారు. ఓజిలి పిహెచ్‌సిని శనివారం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి.బాలక్రిష్ణ నాయక్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఓజిలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వి బాల క్రిష్ణ నాయక్ శనివారం సందర్శించారు. పిహెచ్‌సి పనితీరును అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత ల్యాబ్‌ను, మందుల గదులను, గర్భిణి ప్రసవాల వార్డులను, బర్త్ వెయిటింగ్ హోమ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణిలు, బాలింతలు అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇళ్ల వద్ద కాకుండా, పిహెచ్‌సిలు, ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా వైద్యసిబ్బంది, ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి శ్రీనివాసులు రెడ్డి, డిపిఎంఓపి.శ్రీనివాసురావు, వెంకటరమణా, స్థానిక వైద్యాధికారి డేనియల్, స్థానిక వైద్య అధికారిణి హిమజా, వైద్య సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భక్తులకు సమగ్ర సమాచారం: సిసి కెమెరాలు ఏర్పాటు

## దేవాదాయశాఖ కమిషనర్



శ్రీకాళహస్తి, జూన్ 14 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సంతృప్తికర దర్శనంతో పాటు వారికి సమగ్ర సమాచారం అందించటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ రామ చంద్రమోహన్ శనివారం వివరించారు. కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్న ఆయన జ్ఞాన ప్రసూనాంబ సదన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని దేవాలయాల్లో సెల్ ఫోన్ కౌంటర్లు, చెప్పుల భద్రపరచుగదుల్లో, పార్కింగ్‌లో అత్యధికం వసూళ్ళు చేస్తున్నట్లు భక్తుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన వివరిస్తూ ఈ సమస్యను పరిష్కరించుటకు భక్తుల మనోభావాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి దేవాలయంలో నిర్ధుష్ట ధరల పట్టికలను ఏర్పాటు చేయటమే కాకుండా కట్టుదిట్టంగా ఆచరించాలని ఆదేశించినట్లు కమిషనర్ వివరించారు. గతంలో సమాచారం కోసం ఆడియోలు ఏర్పాటు చేసామని ఇక మీదట ప్రతి ఆలయం లోనూ, సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిర్ణీత రేట్ల కన్నా అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. ఆలయానికి సమీపంలోని దుకాణాల వద్ద కూడ వస్తువుల ధరలు అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని క్రమబద్ధీకరించుటకు ధరల పట్టికను ఏర్పాటుకు ఆదేశించామన్నారు.

**బ్యాటరీ వాహనాలకు ప్రాధాన్యత:**

శ్రీకాళహస్తీశ్వరాలయం నిడివి ఎక్కువ ఉందని అధికారుల సమాచారం మేరకు 11 ఎకరాల్లో ఉందని వివరిస్తూ ఈ ఆలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థ ఇప్పుడున్న బ్యాటరీ వాహనాలతో పాటు అధికంగా ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించినట్లు కమిషనర్ వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌కు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. ఒక్క భవనం మాత్రమే సేకరించాల్సి ఉందని దానిని కూడా త్వరలోనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

**స్వామి అమ్మవార్ల దర్శనం:**

స్వయంభువు వాయులింగేశ్వరుని కమిషనర్ శనివారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుద ర్శనం, ఇఇ మురళీకృష్ణారెడ్డి డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగ భూషణం యాదవ్ వారి సిబ్బంది స్వాగతం చెప్పారు.




## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

సోమల, జూన్ 14, ప్రభాతవార్త



ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జులై 7వ తేదీన ఘనంగా నిర్వహించాలని చిత్తూరు జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ కిషోర్ మాదిగ అన్నారు. సోమలలో ఆయన పర్యటించి మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా జులై 7వ తేదీ బాగా వేడుకలు ప్రతి పల్లెలోనూ నిర్వహించాలని పిలుపునిచ్చారు. అమరవీరుల త్యాగాలను గుర్తించుకోవాలని ఆయన మాదిగ సోదరులకు పిలుపునిచ్చాడు. ప్రతి పల్లెలోనూ జెండాను ఆవిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మాటూరు మురళి, ప్రకాష్ రామనాథం తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం

కుప్పం, జూన్ 14 ప్రభాతవార్త

కుప్పం బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు తెలిపారు. బెంగళూరు నోవా ఫర్టిలిటీ సెంటర్ వారి సహకారంతో సీనియర్ గైనకాలజిస్ట్ డా॥ హరిత మండవ అధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుం దన్నారు. సంతానం లేని వారు ఈ శిబిరంకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 08570- 255002, 77290284059398631629నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## వరసిద్దుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

కాణిపాకం, జూన్ 14 ప్రభాతవార్త:



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని రాష్ట్ర వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.మధుసూధన్‌రావు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సీఐడీ డీఐజీ మురళీరంభ, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లు వేర్వేరుగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి,వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు, రవి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు,చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వర పార్మసీ కళాశాలలో ఘనంగా పట్టభద్రుల వేడుక

**చిత్తూరు రూరల్, జూన్ 14 ప్రభాతవార్త:** చిత్తూరు నగరం మురకంబట్టు సమీపం ఆర్‌విఎస్ నగర్‌లోని శ్రీవేంకటేశ్వర పార్మసి కళాశాలలో శనివారం పట్టభద్రుల వేడుక ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ రావూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈవేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అపోలో మెడికల్ కళాశాల ప్రొపెసర్ డాక్టర్ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హజరయ్యారు. ముఖ్యఅతిథులు చేతుల మీదుగా పార్మసీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీలను అందజేశారు. ఈకార్యక్రమంలో జెన్‌టీయు తరపున డాక్టర్ దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ డి.జ్యోతీశ్వరి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## చికిత్స పొందుతూ యువకుడు మృతి



**శ్రీకాళహస్తి రూరల్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లు గ్రామంలో వరుస విషాద సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం తిరుపతిలో చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతి చెందినట్లు రూరల్ పోలీసు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం గ్రామానికి చెందిన ముగ్గురు స్నేహితులు తొట్టంబేడు మండలం కన్నలి వద్ద తెలుగుగంగ కాలనీలో ఈతకు వెళ్ళారు.ఈ సంఘటనలో మురళి కృష్ణ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు రెండవ రోజు కల్లిపూడి వద్ద శవంగా తేలాడు. ఈ సంఘటనకు సంబంధించి ప్రశాంత్ మనస్తాపం చెంది పురుగుల మందు తాగటంలో ఆతన్ని వైద్యసదుపాయం కోసం తిరుపతి కి తరలించారు.అక్కడ వైద్యం పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు సమాచారం. దాంతో రూరల్ పోలీసులు కేసునమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం జరిపించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని



***చంద్రగిరి, జూన్ 14 ప్రభాతవార్త:*** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కర బాధ్యత అని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం ఆయన రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరుపోశారు. సమాజంలో అడుగడుగునా కాలుష్యం పెరిగిపోయిందనీ, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం మధ్యన ప్రజలు జీవిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నియంత్రణకు తోడ్పడాలన్నారు. అదేవిధంగా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు టి.సుబ్రమణ్యం యాదవ్ చంద్రగిరి మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సక్కూర్ మునిగంగిరెడ్డి, మునిరాజ, ఇందు శేఖర్, దొరస్వామి, నవీన్‌కుమార్‌రెడ్డి, దొరస్వామి నాయుడు, మోహన్‌రాజు, లక్ష్మీదేవి, ఏఆర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చన్నాయుడుని కలసిన శ్రీధర్‌వర్మ

తిరుపతి,జూన్ 14ప్రభాతవార్త:



తిరుపతి పర్యటకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చన్నాయుడును శనివారం ఉదయం టిడిపి రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్ వర్మ కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్బంగా ఇరువురు మధ్య పార్టీ కార్యక్రమాలు, కుటుంబవిషయాలు చర్చించారు.

## టిటిడి ఛైర్మన్ నాయుడుతో

రాష్ట్రసుందరీకరణ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ భేటీ

తిరుమల,జూన్ 14ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలలో టిడిపి నాయకులు,పలువురు వ్యాపా రుల సమస్యలను రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు వివరించారు. శనివారం సాయంత్రం ఆమె టిడిపి నాయకులు బుల్లెట్‌రమణ, తిరుమల రాజుయాదవ్, వెంకీతో కలసి ఛైర్మన్ నాయుడును కలిశారు. ఈ సందర్భంగా తిరుమలలో వ్యాపారులు, లైసెన్స్‌దారుల సమస్యలను వివరించారు.

## కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాబ్ మేళా విజయవంతం

– 627మంది ఉద్యోగాలకు ఎంపిక !!

కుప్పం, జూన్ 14 ప్రభాతవార్త



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో శనివారం నిర్వహించిన జాబ్ ఫెయిర్ 2025కార్యక్రమంకు విశేష స్పందన లభించింది. 30కు పైగా ప్రముఖ కార్పోరేట్ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంకు హాజరై 627మందికి తమ సంస్థల్లో ఉద్యోగాలను కల్పించారు. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై జాబ్ ఫెయిర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత అందివచ్చిచన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రద్దాసక్తులతో విద్యాభ్యాసం పూర్తి చేసి భవిష్యత్తుపై ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బిసిఎన్ విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుకుంటాయన్నారు. ముమ్మందు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాగా టెక్ మహీంద్ర, ఎల్అండ్‌టి, టాటా ఎలక్ట్రానిక్స్, టాటా కేపిటల్స్, హుండాయ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, అపోలో, శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్, డైకిన్, ఫైసా బజార్ వంటి సంస్థలు రిక్రూట్‌మెంట్ న్వింహించాయి. ఏడాదికి రూ2.2లక్షలనుంచి 8లక్షల వేతనాలతో ఉద్యోగావ కాశాలు కల్పించారు. కార్యక్రమంలో కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఓ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, సిడిఓ జయకుమార్, హెచ్ఒడిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## యోగాతో మానసిక ప్రశాంతత..ఏకాగ్రత సాధ్యం

– మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు

కుప్పం, జూన్ 14 ప్రభాతవార్త



యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత సాధ్యమవు తుందని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం యోగాంధ్ర కార్యాలయంలో భాగంగా మున్సిపల్ కార్యాల యం వద్ద యోగా శిక్షణ కార్యక్రమాన్ని యోగా మాస్టర్ గణేష్ అధ్వ ర్యంలో నిర్వహించారు. ఈసందర్బంగా కమీషనర్ మాట్లాడుతూ యోగాతో చక్కటి ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 21న వైజాగ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తోందన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈనెల 21వతేది వరకు యోగాంధ్ర జరుగుతాయన్నారు. ప్రజలు కూడా యోగాంధ్రలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## నేడు కంగుందిలో ముందస్తు యోగా దినోత్సవ కార్యక్రమం

కుప్పంరూరల్, జూన్ 14 ప్రభాతవార్త

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్వర్యంలో కంగుంది గ్రామంలో ముందస్తు యోగా దినోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ విజయదత్ తెలిపారు. కార్యక్రమంకు ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం తదితరులు హాజరవుతారన్నారు. మండలంలో ఉన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉదయం 5.30గంటలకల్లా కంగుంది గ్రామం చేరుకోవాలనిసూచించారు. అలాగేవైద్యఆరోగ్య శాఖచే వైద్య శిబిరం ఏర్పాటుచేయడం జరుగుతుం దన్నారు.

## ఖతర్‌లో రక్తదానం చేసిన ఎన్‌ఆర్ఐ పురుషోత్తం యాదవ్

పాలసముద్రం, జూన్ 14 ప్రభాతవార్త:

ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఖతర్‌లోని దోహాలో పాలసముద్రం మండలం వనదుర్గాపురంకు చెందిన ఎన్ఆర్ఐ పురుషోత్తం యాదవ్ రక్తదానం చేశారు. ఈ సందర్బంగా పురుషోత్తం యాదవ్ మాట్లాడుతూ జిడినెల్లూరు నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అభివృద్ధి పనులు విస్తృతంగా చేపడుతున్నారని, ఆయన నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి చిరస్థాయిలో నిలిచిపోతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని యువత సైతం ఉదారంగా రక్తదానం చేసి ప్రాణాపాయంలో వున్న వారికి ప్రాణదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## యోగాతో ఆరోగ్య సమాజం

పాలసముద్రం, జూన్ 14 ప్రభాతవార్త:



యోగా చేయడం ద్వారా ఆరోగ్య సమాజం ఆవిష్కృతం అవుతుందని తహసిల్దారు అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలోని తిరుమలరాజపురం సచివాలయ పరిధిలోని ఐదు కేంద్రాల్లో శనివారం తహసిల్దారు అరుణకుమారి మహిళలు, పురుషులు, విద్యార్థులతో కలిసి యోగాంధ్రాప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు చేశారు. ఈ సందర్బంగా తహసిల్దారు మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడంతో ఆరోగ్యంగా వుండటంతో పాటు విద్యార్థులు మనశ్శాంతితో చదువులపై దృష్టి కేంద్రీకరించవచ్చునన్నారు. అలాగే ఉద్యోగులు, రైతులు, శ్రామికులు, మహిళలు యోగాసనాలు చేసి పని ఒత్తిడిని తగ్గించుకోవాలన్నారు. ప్రపంచ యోగా దినం పురస్కరించుకుని జూన్ 21న విజయవాడలో యోగా డే నిర్వహిస్తారని, మన మండల పరిధిలో సైతం ఆ రోజు అత్యధికులు యోగాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దేవి, విఆర్ఓ వెంకటాచలం, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కేశవులరెడ్డికి మాజీ డిప్యూటీ సీఎం నివాళి

వెదురుకుప్పం, జూన్ 14 ప్రభాతవార్త :

కర్ణాటక రాష్ట్రం హోస్కోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేశవుల రెడ్డి మృతదేహంకు మాజీ డిప్యూటీ సీఎం నారాయ ణ స్వామి నివాళి అర్పించారు. అలాగే టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి కేశవుల రెడ్డి కుటుంబ సభ్యులను ఆదుకుంటామని స్థానిక ఎమ్మెల్యే వియం.థామస్ తెలిపారని, ఆ దిశగాప్రభుత్వం ఆదుకునే చర్యలు తీసుకోవడం జరుగుతుందని టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జీ మోహన్ మురళి స్పష్టం చేశారు. స్థానిక సర్పంచ్ నవనీతమ్మ, నియోజకవర్గం తెలుగు యువల ఉపాధ్యక్షులు బోడిరెడ్డి సుధాకర్ రెడ్డి. నీటి సంఘం అధ్యక్షులు దామోదర్ రెడ్డి, నాయకులు శివా రెడ్డి, మనోహర్ నాయుడు, చిరంజీవి నాయుడు, చిన్నమ రెడ్డి, కార్తీక్, వెంకటేష్ రెడ్డి, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మహాభారత యజ్ఞానికి రూ. 70 వేలు విరాళం

సోమల,జూన్ 14, ప్రభాతవార్త

సోమల భారతం మిట్టలో జరిగే మహాభారత యజ్ఞానికి బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్కె వెంకటరమణారెడ్డి 50 వేల రూపాయల విరాళం,పెంట పంచాయతీ మేటీ మందంకు చెందిన వై మధుసూదన్ నాయుడు 20 వేల రూపాయల విరాళం అందజేశారు. రాష్ట్ర తెలుగు రైతు సంఘ అధికార ప్రతినిధి సోమల సురేష్, తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వై సాంబయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్ నాయుడు, తెలుగుదేశం పార్టీ మండల జాయింట్ సెక్రెటరీ మునీశ్వరరావు ఆధ్వర్యంలో చెక్కును కార్య నిర్వహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘు, మని నాయుడు, దామోదర్, కృష్ణమూర్తి, చలపతి, గంగాధర్ ఎద్దుల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ లేదని పిల్లల్ని ఆకలితో ఇంటికి పంపుతారా!

- అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలికి

షోకాజ్ నోటీసులు జారీ చేసిన సిడిపిఓ..'వార్త' స్పందన

పాలసముద్రం, జూన్ 14 ప్రభాతవార్త: అంగన్‌వాడీ కేంద్రంలో వంట గ్యాస్ లేదని వంట చేయకుండా పిల్లల్ని ఆకలితో ఇంటికి పంపిస్తారా! వంట గ్యాస్ అయిపోయినప్పుడు ముందు జాగ్రత్త తీసుకోవాలి! ఇలాంటిది ఇంకొకసారి పునరావృత్తం అయితే వేటు తప్పదని నరసింహారాజపురం అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలిని జిడినెల్లూరు సిడిపిఓ పద్మసునంద షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 'ఆకలితో అలమటించిన అంగన్‌వాడీ పిల్లలు' అని శనివారం 'ప్రభాతవార్త'లో ప్రచురితం కావడంతో స్పందించిన జిడినెల్లూరు సిడిపిఓ పద్మ సునంద శనివారం అంగన్‌వాడీ కేంద్రంను తనిఖీ చేశారు. సర్పంచ్ రమేష్‌ను కలిసి వాస్తవాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సంఘటనలు మళ్ళీ పునరావృత్తం అయితే కార్యకర్తతో పాటు సహాయకురాలిని విధుల నుండి తొలగిస్తామని హెచ్చరించి ఇద్దరికి మెమోలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయశ్రీ, అనురాధలు పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## యోగాతో మానసిక శారీరక వికాశం : ఎంపీడీవో పురుషోత్తం

***వెదురుకుప్పం, జూన్ 14 ప్రభాతవార్త :*** యోగాతో మానసిక, శారీరక వికాశం కల్గుతుందని ఎంపీడీవో ఎల్.పురుషోత్తం అన్నారు. మండల కేంద్రంలో యోగా సామూహిక యోగా రిహార్సల్ కార్యక్రమం శనివారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ యోగా వల్ల ప్రజలకు ఆరోగ్యం, మానసిక, శారీరక వికాశం కల్గుతుందని, ప్రజలు గుర్తించి ముందుకు వెళ్ళాలని పేర్కొన్నారు.మండలంలో గ్రామ సచివాలయ పరిధిలో ముందుగా నిర్ణయించిన 9 వేదికల్లో గ్రామస్థాయి యోగాంధ్ర శిక్షకులు పౌరులతో కలిసి యోగా రిహార్సిల్ కార్యక్రమాలు నిర్వహించారు.ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్ యంలు, వైద్య సిబ్బంది, గ్రామసమైఖ్య సభ్యులు, రైతులు పాల్గొని విజయవంతం చేశారు. ఆయనతో పాటు పంచాయితీ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుని భూమి కబ్జా

పుంగనూరు, జూన్ 14, ప్రభాతవార్త



స్వాతంత్రవు సమరయోధుడు తామ్ర పత్ర గ్రహీతకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని కబ్జా చేయడానికి ఆక్రమణ దారులు బరితెగించిన వైనమిది. నియోజకవర్గ తొలి శాసనసభ్యుడు, స్వాతంత్ర సమరయోధుడు తామ్రపత్ర గ్రహీత దివంగత బాడాల కృష్ణమూర్తి రావు కుటుంబం పడుతున్న బాధలు ఇవి. మండలం లక్ష్మీపురం కాలనీ సమీపంలో స్వాతంత్ర సమరయోధుడు. పుంగనూరు నియోజవర్గ తొలి శాసనసభ్యులు బడల కృష్ణమూర్తి రావుకు లక్ష్మీపురం కాలనీ సమీపంలో ఒక ఎకరం 25 సెంట్లు వ్యవసాయ భూమిని ప్రభుత్వం గతంలో కేటాయించింది.ఔ వ్యవసాయ పొలానికి వెళ్లే దానిని కొంతమంది ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వారి కుటుంబీకులు ఆ వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు దారి లేకపోయింది. ఈ విషయమై శనివారం మధ్యాహ్నం స్వాతంత్ర సమరయోధుని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడి కుటుంబ సభ్యుడు. ప్రసాద్ స్వామి మాట్లాడుతూ దారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని, తమ పూర్వీకుల భూమికి దారి కల్పించాలని కోరారు.

## నరేంద్ర మోడీకి దేశమంతా మద్దతు

పుంగనూరు రూరల్, జూన్ 14, ప్రభాతవార్త



భారతదేశ చరిత్రలో ప్రధాని నరేంద్ర మోడీ నా అధ్యాయం ఆవిష్కరించారని, ఆయనకు దేశం మొత్తం మద్దతుగా నిలబడిందనిలో బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షులు జగదీష్ రాజు అన్నారు. ఆయన ఆధ్వ ర్యంలో మండల కార్యశాల కార్యక్రమం శనివారం నిర్వహించారు. 11 ఏళ్లలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలపై వివరంగా తెలిపారు. ప్రధాని మోదీ సమర్ధవంతమైన పాలనలో భారతదేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. పార్టీ ప్రతిష్ఠకు నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ఉచితంగా ప్రభుత్వం ఎంట్రన్స్ ఎగ్జామ్స్ బుక్స్ పంపిణీ

పూతలపట్టు, జూన్ 14, ప్రభాతవార్త

పూతలపట్టు ప్రభాతవార్త మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల చదువుతున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం వారు ఏపీ ఈఏపీ సెట్ ఐఐటి జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు బుక్స్ ఉచితంగా ప్రిన్సిపల్ రమేష్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జీ వి సత్యనారాయణ పాల్గొన్నారు.

## మండల తహశీల్దార్‌గా పార్వతి బాధ్యతలు స్వీకరణ

చౌడేపల్లి, జూన్ 14 ప్రభాతవార్త



మండల తహశీల్దార్‌గా పార్వతి నియమితులయ్యారు. శనివారం ఈమేరకు స్థానిక కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. వి.కోట మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తొలుత స్థానిక మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యాలయపు అధికారులు, విఆర్వోలు స్వాగతం పలికి పుష్పగుచ్ఛమిచ్చి దుశ్శాలవాలతో సత్కరించారు. మండలంలో నెలకొని వున్న రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ పార్వతి అన్నారు.

## వేణుమాధవునికి ఫల పంచామృతాభిషేకం

చౌడేపల్లి, జూన్ 14 ప్రభాతవార్త

స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామికి ఫల పంచామృతాభిషేకానికి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యులు, వేదపండితుల సమక్షంలో అలయం నందు పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామిలను వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బంగారుపాళ్యం, జూన్ 14 ప్రభాతవార్త:



ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తహసిల్దారు రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాంధ్రా కార్యక్రమంలో యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తహసిల్దారు యోగాసనాలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా యోగాంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రతి నిత్యం క్రమం తప్పక యోగాసనాలు చేయాలని తహసిల్దారు పిలుపునిచ్చారు. యోగాసనాలు చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజు, హెడ్మాస్టర్ రాజేంద్ర, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, జూన్ 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శనివారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుం టారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను ఆస్థాన మండ పంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు,రవి, అర్చకులు, వేదపండితులు, భక్తులు

## నైపుణ్యాలతో జీవితంను నిర్మించుకుందాం

– ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఎంజి సుధాకర్‌రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త



పనిలో నాణ్యత కోసం ప్రతి ఒక్కరూ పంచసూత్రా లను పాటించాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఎంజి సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పేడు సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్య శిక్షణాకా ర్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జ్ఞానం,వికాసం, సామర్థ్యం, నైపుణ్యం వున్నప్పుడే వ్యక్తి వృత్తిలో రాణిస్తామన్నారు. బాల్యం నుంచే విలువైన లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని, చదువు మరియు మార్కులకు పరిమితం కాకుండా జీవితానికి అవసరమైన వివిధ కౌసల్యాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమానికి ఎస్ఓఎస్ ఇన్చార్జి సత్యనారాయణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సహకార అధికారిగా లక్ష్మీ



చిత్తూరు, జూన్ 14 ప్రభాతవార్త:

జిల్లా సహకార అధికారిగా లక్ష్మీ నియమితులయ్యారు. సర్వశిక్షాభియాన్ పిఓగా ఇది వరకు విధులు నిర్వహించిన లక్ష్మీ ఆపై జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఓఎస్‌డిగా కొన్ని రోజుల పాటు బాధ్యలు నిర్వర్తించారు. లక్ష్మీని ప్రభుత్వం ప్రస్తుతం జిల్లా సహకార అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఆర్‌టిసి బస్సు ఢీకొని గాయపడ్డ వ్యక్తి మృతి

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణ శివారుల్లో మిట్ట కండ్రిగ గ్రామం వద్ద వారం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రామలింగాపురం గ్రామానికి చెందిన రామ చంద్రయ్య తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం .రామ చంద్రయ్య శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పని చేసే వాడు, విధులు ముగించుకొని తన ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా మిట్టకండ్రిగ పల్లెవెలుగు బస్సు ఢీకొని గాయపడ్డారు.ఆతన్ని తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందగా గ్రామానికి తెచ్చి అంత్యక్రియలు జరిపారు.ఈ అంత్యక్రియలకు సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పరిశీలకులు శ్రీపతి బాబు,లక్ష్మీపతి బాబు, హాజరై శ్రద్ధాంజలి తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## విమాన ప్రమాద మృతులకు నివాళి

పుంగనూరు రూరల్, జూన్ 14, ప్రభాతవార్త



అహ్మదాబాద్ సమీపంలో విమానం కూలి వందలాది మంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈఘటనలో మరణించిన వారి ఆత్మ శాంతించాలని టిడిపి నాయకులు మధురాయల్ ఆకాంక్షించారు. ఆయన ఆధ్వర్యంలో ముదుప్ప సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో, వెలిగించి మోనం పాటించారు. మృతులకు నివాళులు అర్పించారు. టిడిపి నాయకులు, బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రాజారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పారిశుద్ధ్య కార్మికునికి గాయాలు

శ్రీకాళహస్తి, జూన్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలో ద్విచక్రవాహన దారుల స్పీడ్‌కు అంతులేకుండా పోతుంది. కొందరు యువకులు తమ ద్విచక్రవాహనాలను నడిపే స్థితి జనాల్ని భయభ్రాంతుల్ని చేస్తుంది. అయితే పోలీసులు కూడా ఏమి చేయలేని దుస్థితి చోటు చేసుకుంది.ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం విధి నిర్వహణలో కె.నరసింహులు పారిశుద్ధ్య పనులు చేస్తుండగా ఓ ద్విచక్రవాహనదారుడు అతి వేగంగా కారుని ఢీకొని పనులు చేస్తున్న నరసింహులును గుద్దాడు.దాంతో నరసింహులు కుప్పకూలి పోయాడు.దాంతో ఆతని కాలు తొడ భాగంలో విరిగింది.చుట్టుపక్కల వ్యాపారులు గమనించి ఆతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా అక్కడ పరిశీలించిన డాక్టర్ కాలు విరిగిందని తిరుపతికి తీసుకెళ్ళాలని సూచించారు. నాలుగుమాడావీధులను ఎప్పుడూ పరిశుభ్రంగా పెట్టడంలో జవాబుదారి తనంతో పని చేసే నరసింహులుకు ప్రమాదం జరిగిందని తెలియటంతో కుటుంబసభ్యులు తల్లడిల్లి పోయారు.

## శాప్ ఛైర్మన్‌ను కలిసిన శాప్ డైరెక్టర్ రజనీ



***తిరుపతి క్రీడ, జూన్ 14, ప్రభాతవార్త*** శాప్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన ఒలింపియన్ ఇ.రజనీ తిరుపతిలోని శాప్ ఛైర్మన్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవినాయుడుని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో అప్ప గించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ముఖ్యమం త్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్, శాప్ ఛైర్మన్ రవినాయుడుకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెకు శాప్ ఛైర్మన్ అభినందనలు తెలియజేశారు.

## నీట్ ఫలితాలలో అశ్వమేధ విద్యార్థులు ముందంజ




**తిరుపతి విద్య జూన్ 14 ప్రభాతవార్త** స్థానిక ఎంఆర్ పల్లి సర్కిల్‌లో గల అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు నీట్ ఫలితాల్లో అద్భుతంగా రాణించినట్లు డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్,గోవర్ధన లు తెలిపారు. అత్యధిక ఫలితాలు సాధించిన వివిధ కేటగిరిలు విద్యార్థులు అభినవ్ రామ్ 591,అభిషేక్ 560, శ్రేయ 556, హెచ్ వీణ 537, ఏజే సిమ్రాన్ 536, హరీశ్వర్ 535,జి మాధురి 522,ముఖేష్ రెడ్డి 518,ఎన్ జె స్వప్న 509,డి రోషన్ 507 మార్కులను సాధించారు. 102 మంది విద్యార్థులకు గాను 500 మార్కులు పై బడి పదిమంది విద్యార్థులు సాధించారు. 460 మార్కులకు పైగా 23 మంది విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధించి అర్హతను సంపాదించారని తెలిపారు. వీరందరినీ ప్రిన్సిపాల్లు సుమతి,రామయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

## రేపటి నుంచి డిగ్రీ, పీజీ తరగతులు ప్రారంభం

**తిరుపతి విద్య జూన్ 14 ప్రభాత వార్త**

ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ,పీజీ కళాశాలలో సోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. నెలరోజుల పాటు వేసవి సెలవుల అనంతరం తరగతులు ప్రారంభం కానునుండటంతో ఆయా కళాశాలలో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. కళాశాలలతో పాటు అదే రోజు వసతి గృహాలు సైతం తెరుచుకోనున్నట్లు అధికారులు తెలిపారు. పద్మావతి మహిళా వర్సిటీలో సైతం సోమ వారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీడబ్లూ,ఎస్ఎస్, ఎస్వీఆర్ట్స్,ఎస్వీఓరియంటల్‌కళాశాలలుసైతంసోమవారం నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి.

## నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తా : ఎమ్మెల్యే ఆదిమూలం



**కేవీబీ పురం, జూన్ 14 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఎమ్మెల్యే కేవీబీ పురం మండలం అంజూరు పంచాయతీలోని జయలక్ష్మిపురం చేరుకుని రూ.6.50 కోట్లతో కాళంగి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం అంజూరులో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించే పశువుల నీటి తొట్టెను ఎమ్మెల్యే ప్రారంభించారు. తదుపరి అంజూరుగ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మించిన సిమెంటు కాంక్రీట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ జయలక్ష్మిపురం వద్ద కాళంగి నదిపై వంతెన లేకపోవడం వల్ల వర్షా కాలంలో నదిలో నీరు ప్రవహించి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యను ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లిహైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని పట్టుబట్టానన్నారు. సానుకూలంగాస్పందించిన ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి రూ.6.50 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిందని, ఈ క్రమంలో ప్రస్తుతం భూమిపూజ చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సన్నిధివీధిలో రోడ్డు వెడల్పు




**శ్రీకాళహస్తి,జూన్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయ పరిసరాల్లో భక్తులకు సకల సదుపాయాల్లో భాగంగా సన్నిధి వీధి రోడ్డును వెడల్పు కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. సన్నిధివీధిలో పడమర వైపు ఉన్న రోడ్డును విస్తర్ణ కార్యక్రమాలను చేపట్టారు. ఇక్కడ రోడ్డు ఇరుక్కుగా ఉండటంతో రాకపోకలకు నిత్యం అంతరాయంగా మారింది. దాంతో రోడ్ల వెడల్పున ప్రస్తుత ఇఒ డి.బాపిరెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుటకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సన్నిధివీధిని సర్వే చేయించి పోల్స్ నాటించారు. ఆక్రమణ దారులు తమంతట తామే సరి చేసుకోవాలని సూచించారు. వారికిచ్చిన సమయం కన్నా ఎక్కువగానే అవకాశం కల్పించారు. కానీ ఇళ్ళ యజమానులు ఖాతరు చేయక పోవటంతో తమ సర్వే లెక్కల ప్రకారం సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. దాంతో ఈ వీధులు సువిశాలంగా కనబడుతున్నాయి.

## ఏరియా ఆసుపత్రి రక్తదాన శిబిరం




**శ్రీకాళహస్తి,జూన్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో శనివారం ప్రపంచ రక్తదానశి బిరాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఏరి యా ఆసుపత్రి సిబ్బంది ఒరెండు రోజులుగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచిలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో సుమారు 50 మంది రక్తదాని చేసారు. శనివారం మరో 50 మంది ఆసుపత్రిలో రక్తదానం చేసారు. ఈ కార్యక్రమాల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఒడాక్టర్ మురళి కృష్ణ, డాక్టర్ జి.మధు స్టాఫ్ నర్సు సుజాత, లాబ్‌టెక్నిషియన్ ఎస్ తాజిదా, ఎస్ జయబాలాజి, వి.లక్ష్మణ్‌సుభాష్ లు విధులు నిర్వహించారు. ఆసుపత్రి చేపడుతున్న సేవలను గుర్తించిన బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు బి.చంద్రప్ప సారథ్యంలో ఆసుపత్రి సిబ్బందిని సత్కరించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**శ్రీకాళహస్తి, జూన్ 14 ప్రభాతవార్త**

యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చునని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ డి. సంజీవకుమార్ తెలిపారు. ఈసందర్భంగా శనివారం పురపాలక సంఘ ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ యోగదినోత్సవంలో ప్రతిజ్ఞను చేపట్టారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ నేడు సమాజంలో ఎంతో పని ఒత్తిడితో పలు ఆరోగ్యసమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటన్నింటికి పరిష్కారం మానసిక ప్రశాంతత అని తెలిపారు. మానసిక ప్రశాంతత కేవలం యోగతోనే సాధ్యమౌతుందన్నారు. ప్రతి ఒక్కరూ కూడా కనీసం అరగంట నుండి గంట పాటు యోగ చేయాలన్నారు. యోగవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగాదినోత్సవనను యోగ ట్రైనర్ ఏలియంసుజాత ఆధ్వర్యంలో యోగ కార్యక్రమాలను నిర్వహించారు. యోగాదినోత్సవంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాలక్రిష్ణయ్య, తిరుమల, జూనియర్ అసిస్టెంట్ సద్దాంహుస్సేన్, ఆపరేటర్లు రాజ్‌బాషా, మొహిద్దీన్, మేస్త్రీలు హేమచంద్ర, అంతర్గత, బహిర్గత,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెటింగ్ కమిటి సిబ్బందికి వీడ్కోలు



**శ్రీకాళహస్తి,జూన్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటిలో మూడేళ్ళ పాటు తమ సేవలను అందించి సాధారణ బదిలీల్లో చిత్తూరుకు బదిలి అయిన అధికారులకు శనివారం యార్డు కార్యాలయంలో వీడ్కోలు సన్మానం ఏర్పాటు చేసారు. మార్కెటింగ్ కమిటి కార్యదర్శి సెల్వ కుమారి సారధ్యంలో సన్మానం కార్యక్ర మాలను చేపట్టారు. ఇక్కడ ఈ సీనియర్ అసిస్టెంట్‌గా రైతులకు సేవలందించిన ఇమ్రాన్ ఖాన్‌ను ఘనం గా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమాల్లో మార్కెటింగ్ కమిటి సిబ్బందే కాకుండా రైతులు భారీ ఎత్తున పాల్గొన్నారు. రైతులు ఏ సమస్యతో వచ్చినా ఎంతో ఓర్పుగా సమాధానం చెప్పేవారని వారి సమస్యలను పరిష్కరించే వారని పలువురు అభినందిస్తూ ఆయన్ను దుశ్శాలువతో సత్కరించారుఽ. యార్డు అసిస్టెంట్లు బాలకృష్ణ, కాళప్ప, శేఖర్‌రెడ్డి, శివశంకర్,శివకుమార్‌లు సన్మాన కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## ఏర్పేడు పశువైద్యాధికారిణిగా మోహన్‌కుమారి



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం పశువైద్యాధి కారిణిగా డాక్టర్ జి.మోహన్‌కుమారి శనివారం పదవీబాధ్యతలు స్వీకరిం చారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను రైతులకు సక్రమంగా అందేవిధంగా కృషి చేస్తామని తెలిపారు. ఏర్పేడు మండలంలో పశుసంవర్థక శాఖ సేవలు రైతులకు సక్రమంగా అందేవిధంగా కృషి చేస్తామని తెలిపారు.

## శ్రీకాళహస్తి వ్యవసాయశాఖాధికారిగా జి.మమతారెడ్డి

**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మండల వ్యవసాయాధికారిణిగా జి.ఆర్. మమతారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా కనిగిరి నుండి శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైతులకు అందించాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయంలో సూచనలు, సలహాలు అందిస్తామన్నారు. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి రైతులకు సహకరిస్తామన్నారు.

## మల్లవరం వద్ద రోడ్డు ప్రమాదం... ఒకరు మృతి

మరొకరికి గాయాలు...

**రేణిగుంట జూన్ 14 ప్రభాతవార్త** రేణిగుంట మండలం మల్లవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతి నుండి కాకినాడ వెళుతున్న కారు ప్రమాదవశాత్తు రేణిగుంట మండలం మల్లవరం వద్ద రోడ్డు పక్క ఉన్న డివైడర్ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవ్ చేస్తున్న వ్యక్తి రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మరో వ్యక్తి చిన్ని తీవ్రంగా గాయపడ్డాడు. రేణిగుంటఅర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు పోలీసులు హుటాహుటిన సంఘ టనా స్థలం చేరుకొని 108 అంబులెన్సులో క్షతగాత్రుని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నీ శుభాలు కలిగించు స్వామీ



**తిరుపతి(రవాణ), జూన్ 14(ప్రభాతవార్త:** సంకష్టహర చతుర్దశిరోజు విఘ్నాలకు అధిపతి వినాయకుడిని పూజించి వేడుకుంటే అన్నీ శుభాలు జరుగుతాయని వరసిద్దివినాయక మహోత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి సంకట హరచతుర్దశి సందర్భంగా శనివారం సాయంత్రం వినాయకసాగర్‌లోని వరసిద్ది వినాయకునికి ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాదమునిరెడ్డి, మురళి,వాసు, శాంతి, జ్యోతిలక్ష్మి, కృష్ణయ్య, మురళి, వాసు,విజయలక్ష్మి, వాసుదేవరెడ్డి,ఆనంద్ తదితరులతో కలసి అర్చకుడు సురేష్‌స్వామి వినాయకునికి సంకష్టహం 'చతుర్దశిన ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వినాయకుడిని అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి ప్రసాద వితరణ జరిగింది.

## నీట్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం



**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త** శనివారం విడుదలైన నీట్ యూజీ ఫలితాలలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల డిజియం కొండలరావు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లిలోని నారాయణ విద్యాసంస్థల్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు విశ్వక్ అగర్వాల్ 114,చప్పిడి జ్ఞానీషా రెడ్డి 582, లోకేశ్వరి 1253,మోనిక 1393, రామ్ చరణ్ రెడ్డి 1508, కీర్తి 3831,బాలాజీ 4279, ధృతి ప్రియ 4597 వంటి టాప్ ర్యాంకులతో పాటు,దాదాపు 50 మందికి పైగా మెడికల్ సీట్లు సాధించబోతున్నారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల కోర్ డీన్ శ్రీనివాసరావు,డీన్ వేణుగోపాల్,ప్రిన్సిపల్స్ మణికంత,సుధాకర్ నాయుడు,ఎ.జి.యం. చెన్నకేశవరావు,అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాలలో శ్రీధర్స్ అకాడమీ విద్యార్థుల ప్రభంజనం




**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త** తిరుపతి ఎ.ఐ.ఆర్. బైపాస్ రోడ్ లోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు నీట్ 2025 ఫలితాలలో జాతీయ స్థాయిలో చైతన్య రెడ్డి 578,టి ఐశ్వర్య 550,వి మహేష్ 540,కే దుర్గ 535,జి చరనీ సాయి 530,పి.వైష్ణవి 520, కే.సాయి పార్థు 510, హాసిని 502 మార్కులను అదే విధంగా 500 మార్కులు పై బడి 10 మంది విద్యార్థులు సాధించారు. ఈ ప్రతిభ చూపిన విద్యార్థిని,విద్యార్థులను చైర్మన్ మద్దినేని శ్రీధర్, అధ్యాపక బృందం అభినందించారు. తమ సంస్థ పాటిస్తున్న అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

ఉచిత కంటి, దంత వైద్య పరీక్షలు, శిబిరాన్ని ప్రారంభించనున్న డాక్టర్ రామచంద్ర

**సత్యవేడు, జూన్ 14 ప్రభాతవార్త:** సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండల పరిధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి కొలుపు పురస్కరించుకుని ఆదివారం మండలంలోని జానికాపురం గ్రామంలో శ్రీ అంకాళపరమేశ్వరి దేవాలయ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగు ఉచిత వైద్య శిబిరాన్ని నాగలాపురం డాక్టర్ రామచంద్ర ప్రారంభించనున్నట్లు గ్రామ పెద్దలు ప్రతాప్‌నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ ముత్యాల చిన్ని కృష్ణుడు మెమోరియల్ ట్రస్టు నేతృత్వంలో తిరుపతి డాక్టర్ అగర్వాల్ ఐ ఆస్పత్రి వైద్యులు సుమంత్‌రెడ్డి, చెన్నై దంత వైద్యశాల వైద్యురాలు భానుప్రియ ఉచిత కంటి, దంత శిబిరంలో పాల్గొననున్నారు.

## ఎక్సెలెసిస్‌లో ఎమరాల్డ్స్ విద్యార్థుల విజయకేతనం



**తిరుపతి విద్య జూన్ 14 ప్రభాత వార్త** మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి వారు నిర్వహించిన ఎక్సెలెసిస్ 2025 తిరుపతి ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగరవేశారు. ఎక్సెలెసిస్ 2025 నందు డిగ్రీ,పి.జి. విద్యార్థులకు బిజినెస్ క్విజ్,మార్కెట్ మంత్ర, పేపర్ ప్రెజెంటేషన్, మార్కెట్ మేకర్స్,యంగ్ మేనేజర్ వంటి వాభాగాలలో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతల వివరాలు బిజినెస్ క్విజ్ లో పవన్ కుమార్,వైష్ణవి,జాన్సిప్రియ, జశ్వంత్ ప్రథమ స్థానం. మార్కెట్ మేకర్ లో సాయికౌశిక్,శ్రీనితీష్, నవనీత్,పవన్ కుమార్, ప్రథమ స్థానం,జశ్వంత్, శ్రీకాంత్,యశ్వంత్ కుమార్,దీపక్ చౌదరీలు ద్వితీయ స్థానం. ప్రజజ్వెర లో విజయలక్ష్మి,శ్రీకాంత్ ప్రథమ స్థానం. మార్కెట్ మంత్ర లో భవ్యశ్రీ, మైథిలి ద్వితీయ స్థానం సాధించినట్లు ఉపసంచాలకులు మునిరత్నం తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమరాల్డ్స్ సంచాలకులు గిరిధర్ మరియు విశ్వనాథ్ లు విజేతలను,ఉపాధ్యాయులను అభినందిస్తూ, తమ కళాశాలలో నాణ్యతగల విద్యాప్రమాణాలకు నిదర్శనమే తమ విద్యార్థులు సాధిస్తున్న అత్యుత్తమ ఫలితాలు అని తెలియజేశారు. ఈ కార్యక్రమములో ప్రిన్సిపాల్ జాఫర్ వల్లీ, భానుకిరణ్,శివకుమార్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ కార్పొరేషన్ చైర్మన్లకు ఘన సన్మానం



**తిరుపతి కలెక్టరేట్, జూన్ 14 ప్రభాతవార్త :**

ఏపీ కార్పొరేషన్ చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శనివారం స్థానిక ఎల్ఐసీ రోడ్డులోని సంఘ భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని చైర్మన్లను హామీ ఇవ్వడంతో వారు ఎంతో సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ హాండీ క్రాఫ్ట్స్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పి. హరిప్రసాద్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ వూకా విజయకుమార్, ఏపీ యాదవ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్‌లతో పాటు సంఘం ప్రధాన కార్యదర్శి సి. వెంకటేశ్వర్లు శెట్టి, కోశాధికారి మునికృష్ణయ్య, వైస్ ప్రెసిడెంట్ టి. రమణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సిద్దయ్య, జాయింట్ ఉపాధ్యక్షులు టి. గోపాల్, కార్య నిర్వాహక సభ్యులు రమణ, పాపయ్య టి. జయలక్ష్మి, అల్లా బక్ష్, భాగ్యలక్ష్మి, మెహరున్నీబీ పలువురు విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా స్విమ్స్ బ్లడ్ సెంటర్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం

**తిరుపతి హెల్త్, జూన్ 14 ప్రభాతవార్త**



శ్రీ స్విమ్స్ ఇమ్యూనో హెమటాలజీ, ట్రాన్స్ ఫ్యూజన్ మెడిసిన్ (బ్లడ్ సెంటర్) విభాగం ఆధ్వర్యంలో శనివారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రక్తదానం చేయడం వలన కలిగే ప్రయోజనాలను గురించి డాక్టర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి కుమార్, డీన్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ, శ్రీ పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముక్తేశ్వరయ్య, ఆర్ఎంవో డాక్టర్ కోటిరెడ్డి, బ్లడ్ సెంటర్ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్ బాబు, డాక్టర్లు, టెక్నిషియన్లు, పారా మెడికల్ సిబ్బంది, రక్తదాతలు , ఎంఎల్‌టి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుపరిపాలన కూటమికే సాధ్యం....



**రేణిగుంట జూన్ 14 ప్రభాతవార్త** ప్రజలకు మంచి పాలన అందించడం ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వానికి సాధ్యమని బిజెపి యువ నాయకులు వెంకటాద్రి యాదవ్ అన్నారు. దేశ రాష్ట్రలలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా శనివారం ఆయన విజయోత్సవ సంబరాలు గురించి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం ఎంతో మంచి పాలన అందించింది అన్నారు. ఒకవైపు దేశ రక్షణ, మరోవైపు ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలుపరుస్తుండగా కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్లో, విమానాశ్రయాలు నిర్మించడంలో దూసుకుపోతుందన్నారు.

## దామినేడులో మరో ఆలయం నేలమట్టం

తిరుచానూరు, జూన్ 14 ప్రభాతవార్త:

తిరుపతి గ్రామీణ మండలం తిరుచానూరులోని దామినేడులో నాగలమ్మ ఆలయాన్ని తేదేపా తిరుపతి గ్రామీణ మండలం మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు పూర్తిగా కూల్చి వేశారని స్థానిక ప్రజలు తీవ్రంగా అగ్రహించారు. దామినేటి స్థానిక ప్రజలు రాత్రికి రాత్రి తాము పవిత్రంగా పూజించే నాగలమ్మ ఆలయము పూర్తిగా కూల్చివేయడంతో తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకుని ఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు నేలమట్టమై ఉన్న చిన్న ఆలయాన్ని ఫోటోలు తీసి ఆ భూమి సంబంధిత విచారణ చేపట్టారు. ఆలయం వున్న ప్రాంతపు భూ యజమాని తన అనుచరులతో కలిసి ఆలయ వద్ద గల పోలీసులకు భూమి సంబంధిత వివరాలు వివరిస్తుండగా భూమి యజమానికి గ్రామస్తులకు మధ్య తీవ్ర వాక్ వివాదం చోటు చేసుకుంది. అనంతరం ఒక్కసారిగా గ్రామస్తులు భూ యజమాని కృష్ణమూర్తి నాయుడు పై దాడికి పాల్పడ్డారు. తర్వాత గ్రామస్తుల దాడి నుండి పోలీసులు భూ యజమానిని రక్షించి ఆయనను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# తిరుపతి డివిజన్

## సర్వజనుల శుభమంగళం నగర సంకీర్తనం



**తిరుపతి(రవాణ), జూన్ 14(ప్రభాతవార్త** అఖిలాం డకోటిబ్రహ్మాం డనాయకుడైన గోవిందుని నామస్మరణ చేసినా, గోవింద సంకీర్తనలు విన్నా సర్వపాపహరణం జరుగుతుందని రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాలగోపీనాధరెడ్డి తెలిపారు. ఆధ్యాత్మికరాజధాని తిరుపతి నగరంలో మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలన్న సంకల్పంతో శనివారం ఉదయం సాంప్రదాయదుస్తులతో వాయిద్య,భజన సంగీత కళాకారులు గోవింద నామ సంకీర్తనలు ఆలపించారు. వీరితో స్థానిక ప్రజలు,భక్తులు జతకలిశారు. గోవిందనామాలు జపించినా, గోవిందసంకీర్తనలు విన్నా సర్వపాపాలు హరించి శుభాలు కలుగుతాయని రాయలసీమరంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి అన్నారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, గుండాల గోపీనాథ్, రాజశేఖర్‌రెడ్డి,మునినాథరెడ్డి, వాసుదేవరెడ్డి, విక్రమ్‌స్వామి, సురేంద్రరాజు,నరసింహారెడ్డి, కృష్ణమూర్తిఎడ్డి, కవిత, యశ్విని, పద్మావతి, అరుణ,సిద్దమ్మ ,కళావతి, కల్యాణి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కానికి తమవంతు కృషి

**తిరుపతి(రవాణ), జూన్ 14(ప్రభాతవార్త**



రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఏపి హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.హరిప్రసాద్, యాదవ అభివృద్ధికార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఛైర్మన్ వూకా విజయకుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎల్ఐసిరోడ్డులోని రాష్ట్రప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో తిరుపతి నగరశాఖ అధ్యక్షుడు కెఆర్ శంకర్ ఆధ్వర్యంలో సంఘం నెలవారీ సమావేశం జరిగింది. సమావేశంలో ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన స్థానిక నాయకులను సంఘం సభ్యులు సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. సంఘం ప్రధాన కార్యదర్శి సి.వెంకటేశ్వర్లుశెట్టి మాట్లాడుతూ ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేయడానికి ట్రెజరీ నుండి ఫారమ్ 16పొందాలని, సంఘం భవనంలో ఛార్టెడ్ అకౌంటెంట్ ఒకరు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి మునికృష్ణయ్య, వైస్‌ప్రెసిడెంట్ టి.రమణ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సిద్దయ్య, జాయింట్ ఉపాధ్యక్షులు టి.గోపాల్, కార్యనిర్వాహక సభ్యులు రమణ, పాపయ్య,టి.జయలక్ష్మి, అల్లాబక్ష్,భాగ్యలక్ష్మి పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు

## ఘనంగా కుమార్ బిర్లా జన్మదిన వేడుకలు



**తిరుపతి విద్య జూన్ 14 ప్రభాత వార్త** వ్యాపారవేత్త, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా జన్మదిన వేడుకలు తిరుపతిలో కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ పి.సీ.రాయల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక గాంధీ రోడ్ లోని కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం నందు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, బిజెపి నాయకులు సామంచి శ్రీనివాస్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం వెయ్యి మందికి పైగా అన్నదాన నిర్వహించారు. ఈ సందర్భంగా పిసి రాయల్ మాట్లాడుతూ. తన తండ్రి ఆదిత్య బిర్లా మరణం తరువాత, కుమార్ మంగళం బిర్లా కేవలం 28 సంవత్సరాల వయసులో వ్యాపారాన్ని చేపట్టాల్సి వచ్చిందని కానీ క్లిష్ట పరిస్థితులలో కూడా,కుమార్ మంగళం బిర్లా వ్యాపారాన్ని బలోపేతం చేయడానికి,ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి కృషి చేశారని కొనియాడారు. 2021లో వ్యాపార పరివర్తన కోసం టి ఐ ఈ గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డును అందుకున్న మొదటి భారతీయ పారిశ్రామికవేత్త కూడా ఆయన. అలాగే 2019లో బిర్లా ఏ బి ఎల్ ఎఫ్ గ్లోబల్ ఆసియన్ అవార్డును కూడా అందుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బండి మధుసూదన్ రెడ్డి,ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాలలో తిరుపతి ఆకాష్ ముందంజ



**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త** వైద్య కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు నిర్వహించే జాతీయ స్థాయి పరీక్ష నీట్ 2025 ఫలితాలలో తిరుపతికి చెందిన పలువురు ఆకాష్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్,ఏరియా సేల్స్ హెడ్ మోదేమ్ నరసింహులు,ఏరియా ఆపరేషన్ హెడ్ అర్జున్ వద్దే మాట్లాడుతూ ఆల్ ఇండియా స్థాయిలో 2,3, 5,9,10 ర్యాంకులను వరుసగా కైవసం చేసుకోగలిగినట్టు పేర్కొన్నారు. ప్రతి ఏటా నీట్ లో ఉత్తమ ఫలితాలను సాధించడంలో ఆకాష్ విద్యాసంస్థల ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు తమ ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ తిరుపతి నుంచి సుమారు 300 మంది శిక్షణ పొందగా 50 మంది వరకు ఉత్తమ ర్యాంకులు సాధించి మెడికల్ సీట్స్ పొందేందుకు అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. 1000 లోపు ర్యాంకులు 9 మంది తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. ఆకాష్ విద్యాసంస్థల ద్వారా ఉత్తమ ర్యాంకులు సాధించిన వైష్ణవి, లోహిత్ వర్మ, వెంకటాదిత్య, టి లహరి, పార్థకీర్తి,మణికంఠ ,రోహిణి ,మానస,శ్రీజ నాయుడు లను ఈ సందర్భంగా ఘనంగా అభినందిస్తూ వారికి మెమెంటోల్లను బహుకరించారు. ఈ సందర్భంగా ఆకాష్ విద్యాసంస్థల చీఫ్ అకాడమిక్ అండ్ బిజినెస్ హెడ్ ధీరజ్ కుమార్ మిశ్రా మాట్లాతూ తెలుగు రాష్ట్రాల నుంచి అల్ ఇండియా ర్యాంక్ 297 కే నిఖిల్ సాయి , 479 ఎం కునాల్, 557 రుత్విక్ జోషి, 620 తేజేశ్వర్ కృష్ణ మూర్తి సాధించారని పేర్కొన్నారు. ఈ అభినందన సభలో సంస్థ ఫ్యాకల్టీ సభ్యులు, అడ్మిన్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో డాక్టర్స్ మెడికల్ అకాడమీ ప్రతిభ

**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త**



ఎన్ టీఏ శనివారం ప్రకటించిన జాతీయ స్థాయి నీట్ 2025 ఫలితాలలో డాక్టర్స్ మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటారని ఆ కళాశాల చైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2025 విద్యాసంవత్సరంలో తమ అకాడమీ నుంచి 60 మంది పైగా ఎంబిబిఎస్ సీట్లు సాధించబోయే విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు. బై.పి.సి.చదివిన మా విద్యార్థులు నీట్ పి. తన్మయి 80వ ర్యాంకు,గణేష్ బాబు 232, బి. వెంకటవరప్రసాద్ దోహిత్ 371, సి.ఈషర్ రాణి 1147, కె.హర్షవర్ధన్ రెడ్డి 1874, యం.గణేష్ నాయిక్ 3231, వై.సాయి శ్రీ రావు 4774వ ర్యాంకు సాధించారన్నారు. 10000 ర్యాంకు లోగా 15 మంది, 15000 ర్యాంకు లోగా 27 మంది, 20000 ర్యాంకులోగా 38 మంది, సుమారుగా 60 మంది పైగా విద్యార్థులు వివిధ క్యాటగిరిలలో మెడికల్ సీట్లు సాధిస్తారని చైర్మెన్ తెలిపారు. ఈ విజయం సాధించడానికి దోహదపడిన అధ్యాపకులకు,అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థులకు,తల్లిదండ్రులకు కళాశాల ఛైర్మెన్ శ్రీ బి.వి.కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ కె. రహీమ్,వైస్ ఛైర్మెన్ పార్థీవ్ రెడ్డి,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీట్ ఫలితాలలో శ్రీ చైతన్య సంచలనం



**తిరుపతి విద్య, జూన్ 14 ప్రభాతవార్త** ఎన్‌టీఏ ప్రకటించిన 2025 నీట్ ఫలితాలలో శ్రీ చైతన్య శాఖ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు కైవసం చేసుకుని సంచలనం సృష్టించారని ఆ విద్యాసంస్థల ఏజీఎం బివి ప్రసాద్ తెలిపారు. స్థానిక గాంధీ రోడ్డులోని ఆ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారుగా 26 లక్షల మంది పోటీ పడిన నీట్ పరీక్షలో శ్రీ చైతన్య తిరుపతి శాఖకు చెందిన విద్యార్థులు ఓ.అరుష్ లక్ష్మణ్ జాతీయస్థాయిలో 337వ ర్యాంకు,వి.యస్వంత్ 1042,వి.దేవేంద్రన్ 1365, ఎన్.హరిత 2121, వివిఎల్.హర్షిత2277, కె.టీనారాణి2368, జి.గుణభూషణ్ 2460, వై.దీక్షిత2695, వై.మహతి 3723, వై.శివకృతిక 4126, కె.హర్షిత4259, కె.కల్పనా 4824,వంటి టాప్ ర్యాంకులతో పాటుగా , జాతీయస్థాయి లో 10 వేల లోపు ర్యాంకులు 28 మంది,20 వేల లోపు ర్యాంకులు 46 మంది, వివిధ కేటగిరీల నుండి సుమారుగా 120 మంది వరకు ఎంబీబీఎస్ సీట్లు సాధించగలిగే ర్యాంకులు సాధించారని తెలిపారు. రాయలసీమలోనే మరి ఏ ఇతర విద్యాసంస్థకు సాధ్యం కానటువంటి ఫలితాలతో మరొకసారి శ్రీ చైతన్య అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ ఫలితాల సాధనలో నిరంతర పట్టుదలతో పని చేసినటువంటి అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బందిని,ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు సుష్మశ్రీ, నాగేంద్ర ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బైపీసీ విభాగపు డీన్ భాస్కర్, డీన్లు కేఎల్ జీ ప్రసాద్, రామ్మోహన్ రావు, ప్రిన్సిపల్స్,అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

## పేదమహిళకు జనసేన సాయం



**తొట్టంబేడు, జూన్ 14 ప్రభాతవార్త** మండలంలోని చిలుకావారికండ్రిగ గ్రామంకు చెందిన వెంకటమ్మకు జనసేన నాయకులు శనివారం సాయం అందించారు. నిస్సహాయకుటుంబంకు ఒక నెలకు సరిపడ్డ సరుకులు, బియ్యం అందించి ఆదుకోవడం జరిగింది. ఆమె కుటుంబ పరిస్థితిని జనసేన నాయకులకు తెలియజేయగా, జనసేన నాయకులు లక్ష్మణ్ వెంటనే స్పందించి సాయం అందించారు. అందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తొట్టంబేడు మండల ఇన్‌చార్జి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మణి, పేట చిరంజీవి, లోకేష్, మునిచంద్ర, చందు, మహిళలు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I,HINDUSTHAN HARSHAD GHANI (Old Name), S/o HINDUSTHAN ABDUL MAJEED, R/at D No:15-2373,John's Garden, Palamaner Road,Chittoor, A.P.,have changed my name to SHAIK HINDUSTHAN HARSHAD GHANI, Henceforth, I shall be known as SHAIK HINDUSTHAN HARSHAD GHANI ( New Name).

## సచివాలయాల్లో బదిలీల సందడి

కోట, జూన్ 14 ప్రభాతవార్త : గ్రామ సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో సందడి నెలకొంది. 2019 అక్టోబర్ 2న గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చింది. గతంలో సొంత ఊరులో పనిచేయకూడదన్న నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో సచివాలయ ఉద్యోగులు ఎక్కువమంది పొరుగు మండలాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన సాధారణ బదిలీల సమయానికి సచివాలయాల ఉద్యోగులకు ఐదేళ్లు నిండలేదు. బదిలీల్లో భాగంగా రిక్వెస్ట్ పెట్టుకోవడానికి అవకాశం ఇవ్వడంతో కౌన్సెలింగ్ ద్వారా 20 శాతం మందికి స్థానచలనం కలిగింది. తాజాగా ఇచ్చిన బదిలీల జీఓ ద్వారా దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. మే నెలాఖరు నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్లకు పైగా పనిచేస్తుంటే బదిలీ తప్పనిసరి. దీంతో 80 శాతానికి పైగా ఉద్యోగులు బదిలీ కానున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి పనిచేస్తున్న వారందరూ మరోచోటికి మారనున్న నేపథ్యంలో కొత్త వారిని తెచ్చుకునేందుకు అధికార పార్టీ నాయకులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే సమయంలో పక్క మండలాలకు వెళ్లేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేల చుట్టూ సచివాలయ ఉద్యోగులు ప్రదక్షణలు చేస్తూ సిఫార్సు లేఖల కోసం ఎగబడుతున్నారు.

# గూడూరు డివిజన్

## ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన జనసేన



వాకాడు, జూన్ 14 ప్రభాతవార్త: జనసేన మండల అధ్యక్షుడు రౌతుశివకుమార్ ఆధ్వర్యంలో వాలమేడు గ్రామంలోని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. అధ్యక్షుడు శివకుమార్ వాలమేడు గ్రామంలోని తన బృందంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించి అభిమాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయి, కోటేశ్వరరావు, మస్తాన్, వెంకి, శీను, చంద్ర, సుకుమార్, జగన్, తిరుపాల్, సులోచనమ్మ, చెంగమ్మ, కవిత, మాధవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైసీపీకి విమర్శించే అర్హత లేదు : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, జూన్ 14 ప్రభాతవార్త : ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదని వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 13వేల రూపాయల నగదు తల్లులు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా, ఉచిత గ్యాస్ పథకాలు అమలు చేస్తున్నట్లు ఆగస్టు 15 నుండి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నిటిని ప్రభుత్వం నెరవేరుస్తున్నట్లు తెలిపారు. కలిగి వందనం పథకం పొందిన మహిళలతో ఎమ్మెల్యే నగదు ఎప్పుడు పడింది ఎలా ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మాజీ ఏఎంసి చైర్మన్లు రాజేశ్వరరావు, సీసీ నాయుడు, నాయకులు ఆనందు, వెంకటాచలం, నరసింహులు, బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి

గూడూరు, జూన్ 14 ప్రభాతవార్త : పద్దెనిమిదేళ్ల వయస్సు నుండి 60 ఏళ్ల లోపు ఆరోగ్యంగా ఉన్నవారందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీన, డాక్టర్ రోహిణి సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం గూడూరు ఏరియా హాస్పిటల్ నుండి టవర్ క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించారు. రక్త దానంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇతరుల ప్రాణాన్ని కాపాడగలిగిన వారవుతారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో రక్తదాన కార్యక్రమం నిర్వహించే వారికి గూడూరు ఏరియా ఆసుపత్రి బీసీటీ వాహనం అందుబాటులో ఉందన్నారు. గూడూరు బ్లడ్ బ్యాంకు నుండి జిల్లాలోని గవర్నమెంట్ బ్లడ్ సెంటర్లకి బ్లడ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ప్రసూన, సీనియర్ డాక్టర్ రాజా, శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మయూరి శ్యామ్ యాదవ్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువార్తకాంతం, హెడ్ నర్స్ గౌరి, రత్నకుమారి, బ్లడ్ బ్యాంక్ స్టాఫ్ నర్సులు మీనా, బెట్టీ లెబోనా, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్లు మోలాలీ, మనోజ్, బాబూరావు, దిలీప్ హాస్పటల్ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, మైధిలి హాస్పటల్ నర్సింగ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.




## ఆటోబోల్తా నలుగురికి తీవ్రగాయాలు

నాయుడుపేట, జూన్ 14 ప్రభాతవార్త : మండలంలోని పండ్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడి నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. ఆటో ఓజిలి నుండి ప్రయాణికులతో నాయుడుపేటకు వస్తుండగా మార్గమధ్యలో పండ్లూరు వద్ద జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో నెల్లూరు నుండి చెన్నైవైపు వెళుతున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సుజాత, రమ్య, రవి, సుమలతలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌బికెఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



కోట, జూన్ 14 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సిఎస్ఈ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న వంకాయలపాటి భువన కుమార్‌కు హిందూస్తాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, చెన్నై వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఏసీఓఏ-ఎల్ఎస్‌టిఎం మరియు రెసిడ్యువల్ జీఆర్‌యు ఆధారంగా ఎంఐడిఐ మ్యూజిక్ జనరేషన్ మరియు గుర్తింపునకు ఆప్టిమైజ్ చేయడం అనే అంశంపై సవిత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్‌లో పనిచేస్తున్న డాక్టర్ ఎం.కధిరవన్ ఆధ్వర్యంలో పరిశోధన పత్రాన్ని భువన కుమార్ సమర్పించారు. ఈ నేపథ్యంలో సిఎస్ఇ హెచ్ఓడి రాజశేఖర్‌రెడ్డి తదితరులు భువనకుమార్‌ను అభినందించారు.

## మల్టీ పర్పస్ భవనంకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



వాకాడు, జూన్ 14 ప్రభాతవార్త : మండలం తూపిలి పాలెం గ్రామంలోని శనివారం 1కోటి 35 లక్షల రూపాయలతో మల్టీపర్పస్ భవనమును గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శాసనసభ్యులు మాట్లాడుతూ ఎన్నికల ఇచ్చిన వాగ్దానం మేరకు 66 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, ఒక కోటి 37 లక్షల 20 వేల రూపాయలతో రూపాయలతో మల్టీపర్పస్ భవనమును మంజూరు చేశానన్నారు. చెప్పిన విధంగా చెప్పినట్టు చేశానని, ఇంకా ఈ గ్రామంలో అభివృద్ధి కోసం ఎంతైనా చేస్తానని మత్స్యకారులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే తూపిలి పాలెం గ్రామంలో ఎన్ఐఓటి, మల్టీపర్పస్ భవనం, త్వరలో రానున్న నౌక నిర్మాణ తయారీ కేంద్రం, ఇంకా ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఈ ప్రాంతంలో వస్తాయని ఎమ్మెల్యే ఈ ప్రాంత వాసులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి రాజేష్, తాసిల్దార్ రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, సీఐ హుస్సేన్ భాష, ఎస్సై నాగబాబు, టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, బిజెపి గూడూరు నియోజవర్గ కన్వీనర్ పురుషోత్తం రెడ్డి, నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, మహేంద్ర, హరీష్ నాయుడు, ప్రమీల, కృష్ణమూర్తి, బిజెపి మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, దువ్వూరు జనార్దన్ రెడ్డి, గంగాధర్‌రెడ్డి, దయాకర్, ఎంబేటీ పోలయ్య, మత్స్యకార కాపులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల వేతనాలు వెంటనే పెంచాలి : సిఐటియు



గూడూరు, జూన్ 14 ప్రభాతవార్త: అంగన్వాడీల వేతనాలు వెంటనే పెంచాలని, అంగన్వాడీలు గత ప్రభుత్వంలో 42రోజులు తమ కోర్కెల సాధనకై అనేక నిర్బంధాలు ఎదుర్కొని సుదీర్ఘంగా పోరాటం చేయడం జరిగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా ఇంతవరకు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి జిల్లా గూడూరు సిఐటియు కార్యాలయంలో జరుగుతున్న అంగన్వాడీల ద్వితీయ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు చట్టపరమైన గ్రాడ్యుటీ విధానం ప్రవేశ పెట్టడం లేదని, ఇది సమంజసం కాదని, ఏ మాత్రం ఇంతవరకు జీతం పెంచలేదన్నారు. అలాగే జూలై 9వ తేదీ జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను కూడా జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, అంగనవాడీల జిల్లా అధ్యక్షురాలు బి.పద్మలీల, ప్రధాన కార్యదర్శి యస్.వాణిశ్రీ, కోశాధికారి రాజేశ్వరమ్మ, గూడూరు రూరల్ అంగన్వాడీల అధ్యక్షులు ఏ.ఇంద్రావతి, కార్యదర్శి బి.ఎస్ ప్రభావతి, కోశాధికారి రాజేశ్వరమ్మ, సెక్టార్ లీడర్లు మరియు గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో అందరూ ఆరోగ్యంగా ఉంటారు : ఎమ్మెల్యే



వెంకటగిరి, జూన్ 14 ప్రభాతవార్త : నిత్య యోగా చేయడం వల్ల అందరూ ఆరోగ్యంగా ఉండొచ్చని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే రామకృష్ణ పాల్గొని యోగా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రత్యేకంగా యోగా చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 21వ తేదీ భారీగా యోగా కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. అందరూ యోగ చేసి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సిఐ ఏవి రమణ, సిడిపిఓ శంషాద్ బేగం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చంద్రమౌళిరెడ్డి, నాయకులు సత్యనారాయణ, ఆనంద్, నరసింహులు, శ్రీనివాసులులు పాల్గొన్నారు.

## మా గ్రామంలోనే పాఠశాల ఉండాలి

**- నిరసన చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు**



చిల్లకూరు, జూన్ 14 ప్రభాతవార్త: మండలంలోని చేడిమాల గ్రామంలో ఉన్న రెండు ప్రాథమిక పాఠశాలలను అధికారులు మూసేస్తారని చెప్పడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. చిల్లకూరు మండలంలోని చేడిమాల గ్రామంలో ఒకటి, కాలనీలో మరొక ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ రెండు పాఠశాలల్లో కలిసి 36 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. ఈ క్రమంలో భాగంగా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లాయగారి పాళెం గ్రామంలో కూడా ప్రాథమిక పాఠశాల ఉంది. అయితే చేడిమాల గ్రామంలో ఉన్న పాఠశాలలను మూసివేసి అక్కడున్న పిల్లలను సమీపంలోని నల్లాయగారి పాళెం గ్రామంలోని పాఠశాలకు వెళ్ళేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇది తెలుసుకున్న చేడిమాల గ్రామస్తులు పాఠశాలవద్దకు వెళ్ళి తమ నిరసన వ్యక్తం చేశారు. బడి తాళాలు తీయకుండా అడ్డుకున్నారు. తమ పిల్లలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లాయగారిపాళెం గ్రామానికి మా పిల్లలు వెళ్ళలేరని తెలిపారు. మా గ్రామంలోనే పాఠశాల ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## మానవత్వం చాటిన ఎస్సై గోపి

బాలాయపల్లి, జూన్ 14 ప్రభాతవార్త : బాలాయపల్లికి చెందిన రమణయ్య అనే వ్యక్తి రోడ్డు పక్కన మిగతా జీవిగా పడి ఉండడంతో అటుగా వెళుతున్న ఎస్ఐ కామినేని గోపిగుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. బంధువులు రమణయ్య పడి ఉన్న ఎవరు పట్టించుకోకపోవడంతో ఎస్ఐ గోపి, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ రాయి సత్యం నాయుడు అంత్యక్రియలు చేయించారు. ఎస్సై, టిడిపి నేత మానవత్వం చాటారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడులు

కోట, జూన్ 14 ప్రభాతవార్త : మండలం చిట్టేడు పంచాయతీలోని మైక్రోటవర్ కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై ఎస్ఐ .పవన్ కుమార్, తన సిబ్బందితో శనివారం రాత్రి దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ10,160లును వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఐదుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## గురువులు బదిలీల్లో అవస్థలు

కోట, జూన్ 14 ప్రభాతవార్త: బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఐదు రోజులగా నెల్లూరులోని దర్గామిట్ట జిడ్పి ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీల ప్రక్రియ జరుగుతుంది. శుక్రవారం అర్ధ రాత్రి వరకు కొనసాగుతుండటంతో నిరీక్షణకు తోడు అవస్థలు తప్పడం లేదని గురువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలింగ్ జరుగుతున్న చోట కనీస వసతులైన తాగునీరు విద్యుత్తు దీపాలు షెల్టర్ తదితరాల కూడా ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యేచే సీసీ రోడ్డు ప్రారంభోత్సవం



వాకాడు, జూన్ 14 ప్రభాతవార్త : మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని శనివారం బండ్లదెబ్బ దళితువాడలో సుమారు 10 లక్షలతో సీసీ రోడ్డును గూడూరు శాసనసభ్యులు సునీల్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడ స్థానికులతో మాట్లాడుతూ బారెడ్డిపాలెం గ్రామంలోని ఇంకా ఏమి కావాలి ఎన్ని రోడ్లు కావాలి అని గ్రామ ప్రజలతో అడిగారు, ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని స్థానిక నేలతో ఎమ్మెల్యే సూచించారు. గత వైకాపాలనలో తుఫాను సంభవించినప్పుడు ఎన్నో ఇల్లు మునిగిపోయి రోడ్లు తెగిపోయినప్పుడు అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గూడూరు భారీ వంతెన నిర్మిస్తానని, బ్లడ్ బ్యాంక్స్ వేయిస్తానని శంకుస్థాపన చేసిన నేటికి కార్యరూపం దాల్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, దువ్వూరు రమణారెడ్డి పంచాయతీ రాజ్ కిరణ్ కుమార్, తహశీల్దార్ రామయ్య ఎంపీడీవో శ్రీనివాసులు, వర్క్ ఇన్స్పెక్టర్ జగదీష్, ఇంజనీరింగ్ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ యూనిట్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



పెళ్లకూరు, జూన్ 14 ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెళ్ళకూరులో ఉన్న పి హెచ్ సి నందు నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని శనివారం నాడు సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ లాంఛనంగా ప్రారంభించారు ఈ ప్రారంభోత్సవానికి తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి వి.బాలకృష్ణ నాయక్‌తో పాటు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారి వి బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులు (నేషనల్ హెల్త్ మిషన్) ద్వారా 50 లక్షలు వెచ్చించి నిర్మించడం జరిగిందన్నారు. ఇవి మన జిల్లాకు ఎనిమిది భవనాలు మంజూరు కాగా ఇప్పటికే ఐదు భవనాలను ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యంగా విద్య వైద్యం విషయంలో రాజీ పడదని ప్రజల ఆరోగ్యం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. చివరగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన ఈ భవనంలో ల్యాబ్ ద్వారా అనేక రకాల పరీక్షలు చేయడానికి వీలుగా ఉండటం తో పాటు రోగులు రోగులతో పాటు వచ్చే వారికి విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేలూరు మురళీకృష్ణారెడ్డి ఎద్దుల నరేందర్ రెడ్డి సంచి కృష్ణయ్య నాగేందర్‌రెడ్డి పరశురాం యాగాని బెన్ని పోలయ్య ఎంపీడీవో ప్రమీలారాణి ఎమ్మార్వో ద్వారకానాథ్‌రెడ్డి డాక్టర్ జితేంద్ర మరియు డాక్టర్ సుజాత ఆశ వాలంటీర్లు ఏఎన్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

## భార్య కాపురానికి రాలేదని...భర్త ఆత్మహత్య

చౌడేపల్లి, జూన్ 14 ప్రభాతవార్త : భార్య కాపురానికి రాలేదని వ్యక్తి పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు...చౌడేపల్లి పరిధిలోని గడ్డంవారిపల్లి రోడ్డు పక్కనున్న యానాదికాలనీకి చెందిన రవిఅనే గంగిరెడ్డి(24) కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. కరకమందకు చెందిన బేబీతో ఇతనికి వివాహమైంది. వీరికి ఇద్దరు చిన్నారులున్నారు. ఈక్రమంలో కుటుంబంలో ఏర్పడ్డ కలహాల మూలంగా బేబీ ఇటీవల పుట్టింటికి వెళ్ళింది. దీంతో మనస్తాపానికి గురైన రవి కాలనీకి సమీపంలోని పొలంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడున్న అతన్ని చుట్టుపక్కల వారు స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి అటు నుంచి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రవి మృతి చెందాడు.

## జూలై 9న జాతీయ సమ్మెను జయప్రదం చేయండి




గూడూరు, జూన్ 14 ప్రభాతవార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా యావత్ కార్మిక వర్గం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 23వ జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం రోజు తిరుపతి జిల్లా గూడూరులోని సిఐటియు కార్యాలయంలో జరుగుతున్న గూడూరు పట్టణ సిఐటియు మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బి.జె.పి పాలిత రాష్ట్రాలల్లో కూడ లేబర్ కోడ్‌లు అమలు చేసేందుకు వెనకాడుతుండగా ఆంధ్రప్రదేశ్‌లో ఎనిమిది గంటలు పని విధానం ఉండగా దానిని 10 గంటల పని విధానాన్ని ఆమోదిస్తూ మంత్రివర్గం క్యాబినెట్‌లో మూడు నెలలలో 75 గంటలుగా ఉన్న ఓటీని 144 గంటలకు పెంచడం అమానుషమని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గూడూరు పట్టణ సిఐటియు నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యనిర్వాహక అధ్యక్షులుగా పుట్టా శంకరయ్య, అధ్యక్షులుగా పామంజి మణి, ప్రధాన కార్యదర్శిగా బి.వి.రమణయ్య, కోశాధికారిగా ధారా కోటేశ్వరరావు, మొత్తం 19 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, ఆశ, అంగన్వాడి, భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆటో, మున్సిపల్ కార్మిక సంఘం, వీ.ఆర్.ఏ. సంఘాల బాధ్యులులు పాల్గొన్నారు.

## వైభవంగా మాతమ్మ తిరుణాళ్ళ



విజయపురం, జూన్ 14 ప్రభాతవార్త: మండలంలోని మహారాజపురం ఆది ఆంధ్రవాడలో శనివారం మాతమ్మ తిరుణాళ్ళ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఆలయాన్ని, గ్రామంలో వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాతమ్మను అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆవరణలో తౌస్మాన్ ఎక్కారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. నేడు ఆదివారం ఎక్కువ సంఖ్యలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పురుషోత్తం, గ్రామస్తులు డి.ఎస్.రాజు, బాలసుబ్రహ్మణ్యంరాజు, లోకేష్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతుకు రూ.168 కోట్ల సబ్సిడీ

**- నాణ్యమైన కాయలు ఫ్యాక్టరీలకు సరఫరా - రైతును అన్ని రకాలుగా ఆదుకుంటాం - రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు**



గుడిపాల, జూన్ 14 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి రూ.168 కోట్ల సబ్సిడీ చెల్లిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, దాని అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం గొల్లమడుగులోని ఫుడ్ అండ్ ఇన్ ఫ్యాక్టరీలో నిల్వ వుంచిన మామిడి పండ్లను మంత్రి అచ్చెన్నాయుడు శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, హార్టికల్చర్ సెక్రటరీ రాజశేఖర్‌బాబు, అగ్రికల్చరల్ కమీషనర్ శ్రీనివాసులురెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఫ్యాక్టరీలో ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించి అనంతరం పల్లూరులో మంత్రి అచ్చెన్నాయుడు మామిడి రైతులతో మాట్లాడారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులతో చర్చించి ధర నిర్ణయిం చడం జరిగిందన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లు మామిడి రైతుకు కేజీ మామిడికి రూ.8 చెల్లిస్తే ప్రభుత్వం కేజీ మామిడికి రూ.4 సబ్సిడీ రూపంలో మామిడి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యక్షులు అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సుమతిమురళీ, తెలుగుదేశం సీనియర్ నాయకులు కాజూరు బాలాజీ, తెలుగుదేశం నాయకులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు



సత్యవేడు, జూన్ 14 ప్రభాతవార్త: ఏపీ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2024 బ్యాచ్‌కి చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్‌వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వీరికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రణాళిక, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సుస్థిర వృద్ధి నమూనాపై వారికి ప్రదర్శన ఇచ్చారు. మేక్-ఇన్-ఇండియా మిషన్‌లో శ్రీసిటీ పాత్ర భారీ ఉపాధి కల్పన, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఎలా ఊతమిచ్చారన్న అంశాలను వారికి వివరించారు. పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్‌లు శ్రీసిటీ పరిసరాలు సందర్శించారు. ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన పట్ల తన సందేశంలో సంతోషం వ్యక్తం చేసిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ట్రైనీ ఐఏఎస్‌లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. ప్రణాళికాబద్ధ కార్యాచరణ ద్వారా సుస్థిర ప్రగతి సాధ్యం అనడానికి శ్రీసిటీ పయనం సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## నియోజకవర్గంలో భూ మాఫియా రాజ్యమేలుతుంది

**-చంద్రగిరి వైకాపా ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**



తిరుపతిరూరల్, జూన్14 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో భూ మాఫియా, మట్టి మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని చంద్రగిరి నియోజకవర్గం వైకాపా ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆరోపించారు. మాఫియాలకు అండగా స్థానిక ఎమ్మెల్యే ఉన్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో ఆలయాలు ధ్వంసం జరిగిని ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఎద్దేవ చేసారు. తిరుచానూరు గ్రామ పంచాయతీ పరిధిలోని దామినేడు గ్రామ సమీపంలో వున్న పురాతన నాగాలమ్మ ఆలయాన్ని అధికార పార్టీకి చెందిన కృష్ణమూర్తి నాయుడు, ఆయన అనురులు నాగాలమ్మ అర్థరాత్రి ధ్వంసం చేసి, పురాతన శివ లింగాన్ని కూడా జెసిబితో తీసివేసారన్నారు. ఆలయాల పునఃనిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ ఎంపిపి మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపిపి మాధవరెడ్డి, పేరూరు సర్పంచ్ కేశవులు, తిరుచానూరు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోమాతకు విన్నూత్న తరహాలో అంత్యక్రియలు



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 14 ప్రభాతవార్త : నోరులేని గోమాతకు విన్నూత్న తరహాలో అంత్యక్రియలు జరిపి తన ప్రేమానురాగాలను చాటుకున్న రైతు ఉదంతం శనివారం చోటు చేసుకుంది. ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో ఓ కుటుంబం తర తరాలుగా పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవిస్తున్నారు. ఆయన వద్ద ఓ గోమాత 20 సంవత్సరాల పాటు సేవలందించి, శేఖర్‌యాదవ్ కుటుంబాన్ని పెంచి పోషించింది. తన పాలతో ఆ కుటుంబం ఎన్నో శుభ కార్యలను చేసింది. ఆ గోవు ద్వారా 18ఈతల్లో 9 పెయిదూడలు 9 కోడె దూడలకు జన్మనిచ్చింది. తన సంతతిని పెంచుకోవటమే కాకుండా శేఖర్‌యాదవ్ కుటుంబాన్ని పోషించింది. శనివారం ఆ గోవు మృతి చెందడంతో ఆ కుటుంబం తల్లడిల్లి పోయింది. మహిళలు భారీ ఎత్తున పొగ్గె గోమాతకు మనిషి చనిపోతే ఎలా సంప్రదాయ బద్ధంగా సంస్కారాలు చేస్తారో అలాగే ఖననం చేసారు.

## మంత్రి అచ్చం నాయుడుకు ఘన స్వాగతం

రేణిగుంట, జూన్ 14 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చం నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో శనివారం ఘనంగా స్వాగతం లభించింది. విమానాశ్రయం చేరుకున్న ఆయనకు తుడా చైర్మన్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## వాంతులుతో మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని



కేవీబీ పురం, జూన్ 14 ప్రభాతవార్త: వాంతులు కావడంతో మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని సంఘటన కేవీబీ పురం మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన కేవీబీ పురంలోని సీ కాలనీ నివాసి గత నెలలో ఇంటర్ ఉత్తీర్ణత చెందిన శిరీష(17) విద్యార్థిని తన ఇంటర్ మార్క్‌లిస్టు తీసుకురావ డానికి ఏపీ మోడల్ స్కూలు ప్రిన్సిపాల్‌తో మాట్లాడి తిరిగి వచ్చింది. మంచి ఎండలో తిరిగి రావడంతో వాంతులు అధికంగా కావడంతో తల్లిదండ్రులు తిరిగి శ్రీకాళహస్తి ప్రముఖ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే వాంతులు అధికంగా కావడంతో నీరసించి బాలిక మృతి చెందిందని డాక్టర్లు ధృవీకరించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పలువురు మాట్లాడుకుంటూ వయసులో ఉన్న బిడ్డ శుభ్రంగా తలస్నానం చేసి మల్లీపూలు ధరించి ఎటు కాని ఎండలో వెళ్లి రావడం వల్ల ఏదైనా గాలి సోకుండవచ్చన్న ధోరణితో చర్చించుకుంటు న్నారు. ఏది ఏమైనా ఆ బాలిక మృతి చెందడంతో తల్లిదండ్రులు వర్ణనాతీతంగా మారింది.

**CHANGE OF NAME**

I. **KANAPARTI GURAVA REDDY** (Old Name), S/o Kanaparti Ramana Reddy, R/at DNo.16-9, Darga mitta, Panagal, Srikalahasti, Tirupati Dist.AP. I have changed my name to **KANAPARTHI GURAVA REDDY** S/o **KANAPARTHI RAMANA REDDY** (New name).